# మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి 7న సిఎం రాక



**పరిగి జనవరి 30 ప్రభాతవార్త :** పరిగిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగించనున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం సభాస్థలిని ఎంపిక చేస్తున్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు డిఎస్‌పి శ్రీనివాస్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మోహనకృష్ణ, విద్యుత్ అధికారులతో కలిసి పరిగి మండలం రూప్ ఖాన్‌పేట్, నారాయణపూర్ పరిధిలో బహిరంగ స్థలాలను పరిశీలించారు. జన సమీకరణ, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు.



సిఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాస్, సిఐ శ్రీనివాస్



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# ఆలు ఆగం.. అగాధం రైతుల పరిస్థితి



**అనుకూలించని వాతావరణం- సగానికి సగం పడిపోయిన దిగుబడులు - ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి - ఒక్క రవాణా ఖర్చులే క్వింటాకు రూ.700 - మార్కెట్‌లో ధర క్వింటా రూ.700 - ప్రభుత్వ మద్దతు లేక రైతుల దిగాలు - ఆదుకోవాలని డిమాండ్**

(ప్రభాతవార్త - ప్రభాతవార్త)

ఆలుగడ్డ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. కనీసం పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. నీటి వనరులు, సారవంతమైన భూములు ఉండటంతో మండలంలోని మర్పల్లి, బిల్‌కల్, పట్లూరు, మొగిలిగుండ్ల, తుమ్మలపల్లి, రావులపల్లి, కొత్లాపూర్, సిరిపురం తదితర గ్రామాలలో రైతులు దాదాపు 15 ఏళ్లుగా ఆలుగడ్డ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది దాదాపు 250 ఎకరాల్లో సాగు చేశారు.

స్థానిక వ్యాపారులు ఆగ్రా నుండి విత్తనాలు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తారు. స్థానిక రైతులు 50 కిలోల బస్తా రూ.1800 నుంచి రూ.2,200 చొప్పున కొనుగోలు చేశారు. ఎకరానికి విత్తనాలు, దుక్కి, మడులు, క్రిమి సంహారక మందులు, ఎరువులు, కలుపుతీత.. తదితర ఖర్చుల కోసం 45వేల నుండి 50 వేల రూపాయలు వరకూ పెట్టుబడి పెట్టారు.

**అనుకూలించని వాతావరణం..**

ఇక్కడి భూములు వాణిజ్య పంటలకే అనుకూలం. జొన్నలు, మక్కలు, పత్తితోపాటు కూరగాయ పైర్లే ఇక్కడి రైతుల జీవనాధారం. సహజంగా శీతాకాలంలో మాత్రమే ఆలుగడ్డల దిగుబడి బాగుంటుంది. చేలో విత్తనం నాటిన మూడు నెలలకే పంట చేతికందుతుంది. దుక్కి దున్నాలంటే నేల ఆరాలి. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో అధిక వర్షాలు కురియడంతో భూమి గుల్లమీద ఉండగానే విత్తనాలు నాటారు. దీంతో తెగుళ్లు ఎక్కువగా సోకాయి. దీనికితోడు ఈ ఏడాది వాతావరణంలో చలి, మంచు తక్కువగా ఉండటంతో ఆ ప్రభావం దిగుబడిపై కనిపించిందని రైతులు తెలిపారు. గతేడాది ఎకరానికి 10నుంచి 12 బస్తాలు దిగుబడి రాగా ఈఏడాది సగానికి సగం పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొంతమంది రైతుల పొలాల్లో ఇంకా తక్కువ పండిందని చెప్పారు.

**రవాణా ఖర్చులు కూడా రాక..**

మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో జొన్నలు, మక్కలు, పత్తి వంటి దిగుబడులు మాత్రమే కొను గోలు చేస్తారు. కూరగాయల దిగుబడులను సొమ్ముచేసుకోవాలంటే దాదాపు 70 కి.మీ దూరంలో ఉన్న హైదరాబాద్ తీసుకెళ్లాల్సిందే. ఆలుగడ్డకు రవాణా ఖర్చులు పది కిలోల బస్తాకు రూ.60 నుంచి 70 చొప్పున అవుతున్నాయని రైతులు తెలిపారు. ఇన్ని వ్యయప్రయాసలతో తీసుకెళితే అక్కడ ధర బస్తా 70 నుంచి 80 వరకే పలుకుతోందని చెప్పారు. దాదాపు 50 వేల రూపాయల వరకూ మిగతా 2లో

# ఆఖిరి రోజు హడావుడిగా..

**పెద్ద ఎత్తున నామినేషన్లు వేసిన అభ్యర్థులు**

**ముగిసిన నామినేషన్ల ఘట్టం..**

**-పార్టీ బి ఫారంల కోసం ఎదురు చూపులు**



నామినేషన్ వేసేందుకు హడావుడిగా వెళ్తున్న అభ్యర్థులు

**వికారాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దాఖలకు శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు భారీగా తరలివచ్చారు. కొంతమంది అభ్యర్థులు ఊరేగింపుగా నామినేషన్ కేంద్రాలకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ వేయడంతోనే తాము గెలిచాము అన్నట్లు కొంతమంది అభ్యర్థులు హంగామా చేశారు. మీడియా ప్రతినిధుల ముందు సైతం ఫోటోలకు ఫోజులు ఇస్తూ గెలుపు ధీమాను వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు నామినేషన్ వేసిన వెంబటే ఆయా వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. స్వతంత్ర్య అభ్యర్థులు మినహా పార్టీ ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండు లేదా మూడు నామినేషన్ సెట్లు వేశారు. బీ పారం రాని పక్షంలో వేరే పార్టీలోకి వెళ్లాలా..స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలా అనే తర్జన భర్జనలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. నామినేషన్‌ల ఘట్టం ముగియడంతో పార్టీ భీ ఫారాలు నామినేషన్‌ల ఉప సంహరణ తేదీ లోపు అభ్యర్థులు సమర్పించాల్సి ఉంటుంది. పార్టీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో దిగే కౌన్సిలర్ అభ్యర్థులు బీ ఫారాల కోసం పార్టీ అధిష్టాన పెద్దల వద్దకు పరుగులు తీస్తున్నారు. శుక్రవారం నామినేషన్ల గడువు ముగియడంతో శనివారం నామినేషన్‌ల పరిశీలన ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. తదనంతరం అభ్యర్థుల నామినేషన్‌ల తిరస్కరణ జాబితాను ప్రదర్శిస్తారు.



నామినేషన్ సమర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ కుమార్తె అనన్య

# భళారే చిత్రం




**జంప్ జిలానీలకే తాండూరులో ఛాన్స్?**

**స్వపక్షంలోనే ఉంటూ విపక్షానికి జై..**

**గీతదాటేస్తున్న పెద్ద నాయకులు!**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఔను.. తాండూరు రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే!. పార్టీలో చేరాలన్నా, పార్టీ ఫిరాయింపులైనా అక్కడ సర్వసాధారణం. సొంత పార్టీ వెన్నుపోటేయడం ఈజీ. స్వపక్షంలో ఉంటూ ప్రతిపక్షం గెలవాలని కష్టపడే కంకణ బద్ధులూ సిద్ధం. టిక్కెట్ దొరక్కుంటే రెబల్‌గా బరిలో దిగడం సులభం. పొద్దున ఒక పార్టీకి ప్రచారం చేసి సాయంత్రం మరో పార్టీ కండువా కప్పుకొని తిరిగేవాళ్లూ కనిపిస్తారు.

ప్రచారానికి ఐదొందలు, బీరూ..బిర్యానీలకూ దిగులుండదు. దాబాలూ, బార్లలో మందుబాబుల సందడే సందడి. విస్కీ సీసాల గలగలలకూ కొదవేలేదు. మద్యం షాపుల్లో స్కాచ్ విస్కీలకూ భలే గిరాకీ. కుల, మత పిచ్చిగాళ్లూ సందుల్లో దర్శమిస్తారు. ఒట్టు వేయడం, వేయించడం షరామామూలే. దేవుళ్లనూ అడ్డం పెట్టుకుంటారు. హామీలివ్వడం, నెరవేర్చకపోవడమూ రివాజే. అయినా ఓటర్లు ఆదరిస్తూనే ఉన్నారు. నాయకుని అడుగుజాడల్లో నడిచే కార్యకర్తలు లేకపోవడం, నాయకుడు కూడా ఒక పార్టీ సిద్ధంతాలతో ఉండకపోవడమే కారణమని చెప్పవచ్చు. నిబంధనల ఉల్లంఘునలదే రాజ్యంగా సాగుతోంది.

ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అన్ని చిత్రాలూ తాండూరులోనే కనిపిస్తున్నాయి. 36 వార్డులు గల తాండూరులో 77 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఇటీవల ఆశావహుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఐదేళ్ల పాటు పార్టీకి పనిచేసిన వారికి కాకుండా జంప్ జిలానీలకు టిక్కెట్లు వరించాయి. దాంతో పలువురు పార్టీలు మారాల్సి వచ్చింది. కొంతమంది పెద్ద నాయకులు కూడా పార్టీలైన్‌ను దాటి విపక్ష అభ్యర్థులకు పని చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఆయా పార్టీల అగ్రనేతల నుంచి అభ్యంతరాలు వచ్చాయి.

**ఈసారి బరిలో జనసేన**

తాండూరు మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ సహా, బీఆర్ఎస్, బీజేపీ ఎంఐఎం సహా ఈసారి జనసేన నుంచి కూడా అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. ఒకటి, రెండు వార్డుల్లో టిక్కెట్లు లభించని వారు జనసేనను ఆశ్రయించారు. నామినేషన్ల చివ్రా నాటికల్లా జనసేన బీఫారాలు అందజేయనున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో 36 వార్డులకూ అభ్యర్థుల ఎంపిక కష్టసాధ్యంగా మారింది. 22 నుంచి 25 స్థానాల వరకే బలమైన అభ్యర్థులను ఎంపిక చేశారు. మిగిలిన వార్డులకు అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. బీజేపీ, ఎంఐఎం పార్టీకైతే బలమైన అభ్యర్థులను వేళ్లపైనే లెక్కపెట్టవచ్చు. అన్ని వార్డులకూ పోటీ చేయలేకపోతున్నాయి.

**డాక్టర్ సంపత్ రాజీనామా**

ఊహించిన విధంగానే కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ సంపత్‌కుమార్ మిగతా 2లో

# విద్యాలయాలను దేవాలయాలుగా మార్చుదాం

**మొగిలిగిద్ద పాఠశాల చరిత్ర అద్భుతం : మంత్రి పొన్నం ప్రభాకర్**

**షాద్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మొదలుకొని, ఆచార్య హరగోపాల్ దాకా ఎంతోమంది మేధావులను ఈ భూమికి ఇచ్చింది.. ఈ దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసింది.. మొగిలిగిద్ద పాఠశాల చరిత్ర అద్భుతం.. ఈ పాఠశాలకు రావడం నా అదృష్టం.. అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతర వెళ్లే పని ఉన్నప్పటికీ ఆచార్య హరగోపాల్ పిలుపుమేరకు ఇక్కడికి వచ్చానని అన్నారు. ప్రభుత్వానికి అయినా, సంస్థలకు అయినా ఒక చరిత్ర కొలమానం అవుతుందని, ఆ చరిత్ర మీదనే వర్తమానం, భవిష్యత్తు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి ఒక చరిత్ర కలిగిన ఈ పాఠశాల ఎంతోమంది విద్యార్థులకు ప్రాణం పోసిందన్నారు. ఈ గ్రామంలో కూడా తుర్రెబాజ్ ఖాన్ లాంటి పోరాటయోధుల చరిత్ర ఎండి ఉందని అన్నారు. విద్యాలయాలను అందించి గ్రామ గ్రామాన విద్యను వ్యాపింప చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, ఆనాటి పండిత్ నెహ్రూ ఏర్పాటుచేసిన పంచవర్ష ప్రణాళిక ద్వారానే విద్యారంగానికి మేలు జరిగిందని పేర్కొన్నారు. అయితే ఈరోజు అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో కొనసాగుతున్న ప్రభుత్వ పార్టీలోని వదిలేసి పైపై మెరుగులు కనిపించే ప్రైవేటు పాఠశాలల మీద తల్లిదండ్రులు ఆధారపడడం, ఉచిత చదువులు వదిలి అధిక ఫీజుల కోసం అప్పులు చేయడం బాధాకరమని అన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయికి తీసుకువచ్చి అందరూ ఇక్కడే చదివేలా ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. భావితరాలకు ప్రభుత్వాలైన, తల్లిదండ్రులైన ఇవ్వగలిగే ఆస్తి ఒక్క చదువు మాత్రమేనని ఆయన అన్నారు. హరగోపాల్ లాంటి మేధావులు కులం వల్లనో, ఆస్తుల వలన గొప్పవాళ్లు కాలేదని, కేవలం తమకున్న విజ్ఞానం కారణంగా వ్యక్తులుగా కాకుండా ఒక సంస్థలుగా పని చేశారని ప్రశంసించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు విద్యకు ప్రాధాన్యత ఇచ్చి సహకరించగలిగితే విద్యాలయాలు దేవాలయాలుగా మారతాయని ఆయన పేర్కొన్నారు. 150 ఏళ్ల వర్షపు ఉత్సవాన్ని జరుపుకుంటున్న మొగిలిగిద్ద పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, బోధనా రంగంలో ఉన్న ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జిల్లా నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.



**మధ్యాహ్నం ఒంటిగంటకే..**

# గంటకొట్టేశారు

**ఐదుపాఠశాలల్లో బడులకు తాళం**

**ఉపాధ్యాయుని పదవీవిరమణకు మూకుమ్మడిగా హాజరు**

**కుల్కచర్ల, జనవరి 30, ప్రభాతవార్త :** సర్కారు బడులను బలోపేతం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కొంతమంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. పలు చోట్ల ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మా కొడుతుండటంతో తరగతి గదులకు తాళాలు పడుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని కుల్కచర్ల, అముదాలగడ్డ, సుబ్యానాయక్ తండా, రాంపూర్, చిన్నరామయ్య తండా, ప్రభుత్వ పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంటకే తాళాతో దర్శనమివ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అవాక్కయ్యారు. చిన్నారులను పాఠశాలను నుండి వదిలేయడంతో వారు ఎక్కడ పడితే అక్కడ తిరుగుతుండడంతో తల్లిదండ్రులు అగ్రహం వ్యక్తం చేశారు. కుల్కచర్లలో ఒక ఉపాధ్యాయుడు పదవీవిరమణ కార్యక్రమానికి మండలంలో వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు మూకుమ్మడిగా బడికి తాళాలు వేసి హాజరయ్యారని తెలిసింది. ఈ విషయంపై విద్యాశాఖ జిల్లా అధికారి రేణుక దేవిని వివరణ కోరగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రాధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ ఉన్నందున్న వచ్చరేమో అని.. తాము పాఠశాలలను మూసివేయమని చెప్పలేదని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిని సహించేదిలేదని.. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.




శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకే తాళం వేసి ఉన్న పాఠశాల

# పెయిడ్ న్యూస్‌పై ఆంక్షలు

**సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై కలెక్టర్ సీరియస్**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పేయిడ్ న్యూస్‌పై అధికారులు నిఘా పెట్టనున్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్టమైన నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ప్రతీ క్జైన్ ఆదేశించారు. ప్రధాన దినపత్రికలను, స్థానిక ఛానెళ్లను నిశితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీపీఆర్వో ఆఫీసులో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటిరింగ్ కమిటీ (ఎమ్‌సీఎంసీ) కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచురితమయ్యే కథనాలను, టెలికాస్ట్ చేసే ఛానెళ్ల వివరాలు తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలు, ప్రచారాలు, ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మీడియా సెంటర్‌కు సంబంధించి అన్ని రకాల రిజిష్టర్‌లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. మిగతా 2లో



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్



అభిమానులతో కలిసి అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దుడ్డు ఆంజనేయులు

# పెరిగిన మున్సిపల్ వేడి

**చివరిరోజున భారీ బల ప్రదర్శనతో నామినేషన్లు**

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాతవార్త:** ఆమనగల్లు పురపాలక సంఘం ఎన్నికల సెగ మరింత వేడెక్కింది. నామినేషన్ గడువు శుక్రవారంతో ముగిసింది. దాఖలుకు శుక్రవారం చివరిరోజు కావడంతో పలు పార్టీల అభ్యర్థులు బలగంతో వచ్చి ఎన్నికల నామినేషన్ సెట్‌లు వేశారు. చివరిరోజు కావడంతో బిజెపి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి హట్టహాసంగా నామినేషన్ వేసి మిగతా 2లో

# బిల్‌కల్‌లో హత్య

**అక్రమసంబధమే కారణం?**

**మర్పల్లి జనవరి 30ప్రభాతవార్త:** మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బిల్‌కల్ గ్రామానికి చెందిన చెరాల నర్సిములుగౌడ్(43) అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. తలపై బండ రాయితో కొట్టిన రక్తపు గాయాలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉండ వచని మృతుని బంధువులు భావిస్తున్నారు. నర్సిములు గౌడ్ గురువారం రాత్రి 8 గంటల సమయంలో పొలం చూసి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడని.. ఎంతకు తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందని భార్య వసంత తెలిపారు. ఇరుగు పొరుగు వారి సమాచారం ప్రకారం గ్రామ శివారులోని ఈడిగి చెంద్రయ్య జొన్న చేలో తన భర్త మృతి చెంది పడి ఉన్నాడని పేర్కొంది. గ్రామానికి చెందిన ఓ మహిళతో గత కొంత కాలం నుండి అక్రమ సంబందం కలిగి ఉన్నాడని.. గత రెండు, మూడు నెలల నుండి తన భర్త ఆమె వద్దకు వెళ్లడం లేదని, ఆమే తరుచుగా ఫోన్ చేస్తూ 'నీ భర్త నాకు కావాలి.. అవసరమైతే నిన్ను చంపి నీ భర్తతో ఉంటా' అంటూ తనను బెదిరించేదని తెలపింది. తన భర్తను వారే చంపి ఉండ వచ్చని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మర్పల్లి యస్.ఐ అబ్దుల్ రహూఫ్ తెలిపారు.

# ఛాన్స్ ఇవ్వలేదని జంప్

**బిఆర్‌ఎస్‌లో చేరిన సీనియర్ కాంగ్రెస్ నేత రాంరెడ్డి**

**బిఆర్‌ఎస్ టికెట్ ఖరారు..**

**శామీర్‌పేట, జనవరి 30, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి రాంరెడ్డి, ఆయన సతీమణి బండి లక్ష్మిలు కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో చేరారు. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయటానికి టికెట్ ఇవ్వకపోవటంతో ఆయన అసంతృప్తిలో ఉండటంతో బిఆర్ఎస్ నాయకులు ఆయనతో చర్చించి బిఆర్ఎస్ నుంచి టికెట్ ఇస్తామని అనటంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. మిగతా 2లో



# ఆలు ఆగం.. రైతుల పరిస్థితి అగాధం



పెట్టుబడి పెట్టి పంటసాగు చేస్తే చివరికి రవాణా ఖర్చులు కూడా దక్కడం లేదని రైతులు వాపోయారు. గత ఏడాది కంటే గోనె సంచుల కొనుగోలు, రవాణా చార్జీలు కూడా పెరిగాయని తెలిపారు.

**ప్రభుత్వ సాయం సున్న..**

రాష్ట్రంలో ఆలుగడ్డ సాగు అత్యధికంగా ఉన్నా..వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో దెబ్బతిన్న రైతులను ప్రభుత్వాలు ఆదుకోవటానికి ముందుకు రావటంలేదని రైతు సంఘాలు నిరసన వ్యక్తంచేస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితులు కనిపించడం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం, పత్తి పంటలకు మద్దతు ధర ఉన్నట్లుగానే ఆలుగడ్డకు కూడా మద్దతు ధరను ప్రకటించాలని కోరుతున్నారు.

**కోల్డ్‌స్టోరేజీ గోదాములు నిర్మించాలి**

దిగుబడులను జిల్లాలో నిల్వ ఉంచే ఏర్పాట్లు కూడా లేవని.. దీంతో గిట్టుబాటు ధర ఉన్నా లేకపోయినా అప్పటిక ప్పుడు తెగన మ్ము కోవా ల్సి వస్తోందని రైతులు పేర్కొం టున్నారు. మద్దతు ధర వచ్చే వరకూ నిల్వ చేసుకో వటానికి కోల్డ్ స్టోరేజీ గోదాములు నిర్మించాలని కోరతున్నారు.

**ప్రైవేటు మార్కెట్లో అధరహో..**

దుక్కిదున్నించి..అనేక కష్టనష్టాలకు ఓర్చి సాగుచేసిన రైతుల నుంచి కిలో రూ.6 నుంచి రూ.7 చొప్పున కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వినియోగదారుల నుంచి కిలో రూ.40 నుంచి రూ.70 చొప్పున వసూలు చేస్తున్నారు.



**నష్టం నుంచి బయటపడే దారేది?**

**సంజీవరెడ్డి, మర్పల్లి**

సుమారు లక్ష 20వేల రూపాయలు ఖర్చు చేసి రెండెకరాల పొలంలో ఆలుగడ్డ సాగు చేశా. తెగుళ్లు రావడంతో ఎకరానికి 50 బస్తాలు మాత్రమే పండింది. క్వింటాలు 700 రూపాయలకు అమ్మా. లాభం సంగతి దేవుడెరుగు.. కనీసం పెట్టుబడి ఖర్చుల్లో సగం కూడా చేతికి రాలేదు.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

ఎకరంన్నర పొలంలో ఆలుగడ్డ సాగు చేశా. బస్తా ఆలుగడ్డ విత్తనం రూ.1800 నుండి 2,200 చొప్పున కొన్నా. అన్నీ కలిపి 50 వేల రూపాయలు ఖర్చు అయింది. వాతావరణం మామీద పగపట్టిందో ఏమో.. అసలు కాలం కలిసిరాలేదు. సగానికి సగం దిగుబడి తగ్గిపోయింది. అప్పులుచేసి పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం ఆదుకోవాలి.



పట్లూరి జ్యోతి, మర్పల్లి

## తాండూరులో ఎగిరేది కాంగ్రెస్ జెండాయే

### చైర్మన్ అభ్యర్థిని అధిష్టానమే నిర్ణయిస్తుంది

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**తాండూరు, జనవరి 30, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపాల్టీపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి ఎవరనేది పార్టీ అధిష్టానమే నిర్ణయిస్తుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో పార్టీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. తాండూరు ప్రాంత ప్రజల్లోనే కాంగ్రెస్ డిఎన్ఏ ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 36 వార్డులకు 30కి పైగా స్థానాలు గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో.. తాండూరు ఎమ్మెల్యేగా మున్సిపల్ అభివృద్ధికి రూ.1000కోట్ల నిధులు తీసుకువచ్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్ల పాటు కుర్చీ కోసం, ఆదిపత్యం కోసం కొట్లాడి తాండూరు పట్టణాన్ని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. మళ్లీ అలాంటి పరిస్థితి రానివ్వబోమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పంచాయితీ ఎన్నికల్లో 25 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులకు భయం పట్టుకుందని, అందుకే లేని పోనీ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మతిభ్రమించి అవాకులు.. చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారికి ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చేస్తారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చైర్మన్ అభ్యర్థి ఎవరనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**చివరి రోజు 165 నామినేషన్లు**

తాండూరులో మున్సిపల్ ఎన్నికలకు సంబందించి నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు 165 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెత్త ఎత్తున తరలి వచ్చారు. దీంతో మున్సిపల్ కార్యాలయం కోలాహలంగా మారింది. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం తదితర పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు నామినేషన్ దాఖలు చేశారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు అభ్యర్థులు పోటా పోటీగా నామినేషన్లు సమర్పించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ప్రక్రియలో 273 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజు 11 నామినేషన్లు, రెండో రోజు 97, చివరి రోజు 165 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాంగ్రెస్ నుంచి 88, బిఆర్ఎస్ నుంచి 96, బిజెపి నుంచి 49, ఎంఐఎం నుంచి 16, బిఎస్‌పి నుంచి ఒకటి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య పర్యవేక్షణలో పట్టణ సిఐ సంతోష్‌కుమార్, సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.

## మూడుచింతలపల్లిలో 175..

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 30, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మూడవ రోజును నామినేషన్లు అధికంగా అందాయి. చివరి రోజు వరకు మూడు రోజులలో అందిన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులలో మొత్తం 144నామినేషన్లు అందాయి. వీటిలో బిఎస్‌పి-4, బిజెపి-31, సిపిఐఎం-2, కాంగ్రెస్-47, బిఆర్ఎస్-38, జనసేన-8, ఎఐఎఫ్‌బి-2, ఇతరులు-12నామినేషన్లు అందినట్లు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ వివరించారు.



అలియాబాద్ 8వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కంటం శిరీషకృష్ణారెడ్డి

మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులకు సంబంధించి వివిధ వార్డులలో చివరి రోజు వరకు మూడు రోజుల నుంచి 175నామినేషన్లు అందాయి. వీటిలో బిఎస్‌పి-2, బిజెపి-41, కాంగ్రెస్-57, బిఆర్ఎస్-53, రిజిష్టర్డ్ పార్టీ-4, ఇతరులు-18 నామినేషన్లు మొత్తం 175 నామినేషన్లు అందినట్లు మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. చివరి రోజున నామినేషన్లు వేయటానికి భారీ సంఖ్యలో అభ్యర్థులు రావటం, భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## బిఆర్ఎస్ నేత గిరియాదవ్‌కు బిజెపి తీర్థం

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాతవార్త:** ఆమనగల్లు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ కీలక నేత తోట గిరియాదవ్ కమలం తీర్థం పుచ్చుకున్నారు. జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు, కల్వకుర్తి నియోజకవర్గ పార్టీ ఇంచార్జీ తల్లోజు ఆచారి శుక్రవారం గిరియాదవ్‌కు పార్టీ కండువ కప్పి చేర్చుకున్నారు. గుర్రంగుట్ట కాలనీలో భారీ ఎత్తున తరలివచ్చిన బిజెపి నాయకుల సమక్షంలో పెద్ద ఎత్తున తన అభిమానులతో కలిసి తోట గిరియాదవ్ కమలం పార్టీలో చేరారు.

ఈసందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ నరేంద్రమోడీ నాయకత్వం పట్ల విశ్వాసం, దేశాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును స్వాగతించడంతోనే పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారన్నారు. సామాన్య కార్యకర్తకు కూడా జాతీయ స్థాయి పదవులు కట్టబెట్టడం ఒక్క బిజెపిలోనే సాధ్యమని ఆచారి కొనియాడారు. నితిన్ నబిన్ అందుకు ఉదహరణగా ఆయన అభివర్ణించారు. అనంతరం తోటగిరియాదవ్ మాట్లాడుతూ ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి బిజెపి అనుసరిస్తున్న దానికి మద్దతుగా పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ సిద్దాంతాలు, ఆశయాలకనుగుణంగా, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని తోట గిరియాదవ్ తెలిపారు. కాగా తోట గిరియాదవ్ బిజెపిలో చేరికతో 6వవార్డుతో పాటు మున్సిపాలిటీలో అదనపు బలం చేకూరుతుందని పలువురులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీకాంత్‌సింగ్, గంగరవి, పాలాది శ్రీనివాస్, నరేందర్‌నాయక్, జెజ్జాయిల ఆనంద్, గజ్జెయాదమ్మ, పాతకోట శ్రీశైలం,మల్లేశ్, లింగంపల్లి అశోక్, నాగిళ్ళ లింగం, వెంకటేశ్వర్‌రెడ్డి, తోట ఆనంద్, తోట మల్లేశ్, పూసలి బాలయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## పరిగిలో వలసల జోరు

**పరిగి టౌన్ జనవరి 30 ప్రభాతవార్త :** పరిగి మున్సిపల్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వలసలు జోరందుకున్నాయి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయినందుకు ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడినది కావున వివిధ నాయకులు ప్రజల్లో తిరగలేకపోతున్నారు దీన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ కాంగ్రెస్ నాయకులు కోఆప్షన్ సభ్యులు ముజామిల్ తనతోపాటు పదిమందిని తీసుకొని టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు మళ్లీ ఎలాగైనా పరిగి గడ్డపై టిఆర్ఎస్ జండా ఎగరాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయింది రైతుబంధుకు రామ్ రామ్ కొట్టింది టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు డిసెంబర్ అనే ఇచ్చేది కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి దాటి ఫిబ్రవరికు వస్తుంది ఇప్పటివరకు రైతుబంధు రైతుల ఖాతాలలో జమ చేయలేదు. ఇదంతా ప్రజలు గమనిస్తూ ఉన్నారు వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు తగిన గుణపాఠం చెప్పాలి పరిగి మున్సిపల్ పరిధిలో ఏది ఏమైనప్పటికీ టిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయం అని మాజీ ఎమ్మెల్యే మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో దోమ మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి. మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ కుమార్. పరిగి మండల టిఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు. దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి వివిధ టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

## కొడంగల్‌లో చివరి రోజు 52 నామినేషన్‌లు

**కొడంగల్, జనవరి 30, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలో 12 వార్డులకు గాను చివరి రోజు శుక్రవారం 52 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బుధవారం మొదటి రోజు ఎవ్వరు నామినేషన్‌లు దాఖలు చేయలేదు. రెండవ రోజు గురువారం 20 నామినేషన్‌లు దాఖలు కాగా చివరి రోజు శుక్రవారం 52 నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో కాంగ్రెస్,బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఇదిలావుండగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్, జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్‌లు తమ అనుచరులతో భారీ ర్యాలీగా తరలివచ్చి 12 వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇందులో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ 4వ వార్డుకు నామినేషన్ దాఖలు చేయగా 1వ వార్డు నుండి మాజీ మున్సిపల్ చైర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి,నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 12 వార్డులకుగాను 72 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా శనివారం అభ్యర్దుల నామినేషన్ పత్రాల పరిశీలనతో స్రుటిని ఉంటుందని అధికారులు తెలిపారు.



కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు





మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి

## నామినేషన్ ప్రక్రియ తనిఖీ

**పరిగి, జనవరి 30, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నామినేసన్లు స్వీకరణకు చివరి రోజు అవ్వడంతో పరిగిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్‌ను మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి, ఐ ఎ ఎస్ సందర్శించారు. శుక్రవారం పరిగి మున్సిపల్ కార్యాలయం లో నామినేషన్ ప్రక్రియ గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ నామినేషన్‌ల చివరి రోజు అయినందున సాయంత్రం 5గం.లకు ముందే వచ్చిన వారికి టోకెన్లు ఇవ్వాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్ల ను స్వీకలించాలని అధికారులకు ఆదేశించారు. సమర్థవంతంగా నిర్వహించి, అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేసి, ఏవైనా సందేహాలను నివృత్తి చేయాలనితెలిపారు. 1 నుండి 18 వార్డులకు 6 కౌంటర్లు, 8 మంది ఆర్ఓ లు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో పూర్తి స్థాయి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరి, డిఎస్పి శ్రీనివాస్ , పోలీస్ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మక అడుగులు

### -చైర్మన్ పదవిపై మూడు పార్టీల కన్ను

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల మొదటి ఘట్టంను రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా ముగించాయి. గెలుపు గుర్రాలను అన్వేసించి అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నాయి. మున్సిపాలిటీ చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఛాకచక్యంగా వ్యవహరిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక కొరకు అధినేతలు కొన్ని రోజుల నుండి కసరత్తులు చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో 15వార్డులు ఉన్నాయి. జనరల్ 8, ఎస్టీ 4, ఎస్సీ 2, బిసి 1 స్థానాలను ఎన్నికల సంఘం అధికారులు రిజర్వు చేశారు. అలాగే చైర్మన్ పదవి జనరల్‌కు వహించడంతో పోటి మరింత తీవ్రమైంది. రాజకీయ పార్టీలలోని ముఖ్య నేతలు స్వయంగా రంగంలోకి దిగేందుకు రంగం సిద్దం చేసుకున్నారు. తుదకు అధినేతలు ఆయా వార్డులలో సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి నామినేషన్ వేయించారు. పలువార్డులలో అభ్యర్థుల నుండి పోటీ ఎక్కువ కనిపించింది. అధికార కాంగ్రెస్, బిజెపి పార్టీలలో ఈపోటి కాస్త ఎక్కువ ఉన్నా బిఆర్ఎస్‌లో మాత్రం కాస్త భిన్నంగా కనిపించింది. పోటీ తీవ్రతను తగ్గించి నమ్మకమైన నాయకులను రంగంలోకి దింపేందుకు అధినేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు ఆయా పార్టీలో వినిపిస్తున్న వినికిడి. అలాగే ఓటర్లను ఆకర్షించేందుకు నామినేషన్ల చివరిరోజు బిజెపి, కాంగ్రేస్, బిజెపి బలప్రదర్శన చేసి ఆకట్టుకున్నాయి. ఎలాగైన ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పావులు కదుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ పార్టీకే దక్కాలనే కసితో అందుకు తగ్గ ఎత్తుగడల పాచికలతో మూడు పార్టీలు ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా జనరల్ వార్డులలో తీవ్ర పోటీ కనిపిస్తుంది. ధనబలం కల్గిన నాయకులను ఎంపిక చేసి ఆయా వార్డులలో వారిని రంగంలోకి దింపినట్లు కనిపిస్తుంది. ఈమేరకు ఆయా వార్డులో ఇతర పార్టీల అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనాలు వేస్తూ మూడు పార్టీల అధినేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



## కాంగ్రెస్ యువనేత అందె మోహన్ నామినేషన్..

### పట్టణంలో భారీ ర్యాలీ

**షాద్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త :** భారీగా తరలివచ్చిన అభిమానులు.. అత్యంత భారీ ఎత్తున ఏర్పాట్లు.. కార్యకర్తల నినాదాలు.. డప్పుల మోతలు.. జాన పద కళాకారుల నృత్యాలు నడుమ కాంగ్రెస్ జెండాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ యువ నాయకుడు అందేమోహన్ కాంగ్రెస్ పార్టీ తరపున పట్టణంలోని 14వ వార్డు నుంచి నామినేషన్ వేశారు. తన వార్డు నుంచి ప్రధాన రహదారుల మీదుగా పెద్ద ఎత్తున ర్యాలీ జరగడం పట్టణవాసులను ఆకట్టుకుంది. కాంగ్రెస్ యువ నేతగా పార్టీలో ప్రస్తుతం చురుకైన పాత్ర నిర్వహిస్తున్న అందె మోహన్ వెంట పెద్ద ఎత్తున యువత, మహిళలు తరలి రావడం విశేషం. భారీ ఎత్తున జనంతో ఎన్నికల కేంద్రం వద్దకు చేరుకున్న అందేమోహన్ అనంతరం తన నామినేషన్ ను అధికారులకు సమర్పించారు. నామినేషన్ అందించగానే నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నేతను ఉత్సాహపరిచారు. గెలుపు కాంగ్రెస్‌దే..అభ్యర్థి అందెమోహన్ షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలలో అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని యువనేత అందమోహన్ అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు సహకారంగా గెలిపించేందుకు ముందుకు వచ్చిన యువకులకు, మహిళలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసి మున్సిపాలిటీలో ప్రతి వార్డును అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇక్కడ కూడా చైర్మన్ స్థానం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఆ పార్టీని గెలిపిస్తాయని, ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన బీఆర్ఎస్ ఓటమి తధ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతం

**షాద్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త :** బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ 2026 ఎన్నికలు పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ అడిషనల్ డిస్టిక్ కోర్ట్ ప్రాంగణంలో జరిగిన ఎలక్షన్లలో 165 ఓట్లకు గాను 161 ఓట్లు పోలైనాయి. ప్రశాంతమైన వాతావరణంలో న్యాయవాదులందరూ శుక్రవారం ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల సమయం ముగిసిన అనంతరం బాక్సులను సీల్ చేసి బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ హైకోర్టు వారికి చేరవేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చేనెల 10వ తారీకు కౌంటింగ్ ప్రారంభమవుతుందనీ ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కొత్త రవి, పోలింగ్ ఆఫీసర్ గుండుబాయి శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ అంతారం నరసింహులు, సుపరిండెంట్ నాగమల్లేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్వ వేణుగోపాల్ రావు, కాంటెస్ట్ అభ్యర్థులు బీ జగన్మోహన్ రెడ్డి, దానక్క సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## మొగిలిగిద్దలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్

### దత్తత తీసుకోకుండా నేను అభివృద్ధి చేస్తా

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త :** 150 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధి పథంలో పయనించడమే కాకుండా, మొగిలిగిద్ద గ్రామం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కూడా అందుకొని చరిత్ర సృష్టించబోతుందని ఎమ్మె ల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం మొగిలి గిద్ద గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాల వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధికారులు తదితరులు హాజరైన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ.. ఇన్నేళ్ల చరిత్రలో ఈ పాఠశాల ఎంతోమందిని విద్యార్థులుగా తీర్చిదిద్దని అన్నారు. భూ రక్షి త పథకం ద్వారా నిరుపేదలకు భూములు ఇప్పించిన బూర్గుల రామకృష్ణారావు లాంటి మహనీయులు చదివిన పాఠశాల ఇది అన్నారు. 90 సంవత్సరాలు దగ్గర పడుతున్న ఎప్పుడూ గ్రామానికి ఏదో ఒక సేవ చేయాలని తపించే హరగోపాల్ లాంటి గొప్ప వ్యక్తులు, ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా విలువలతో పనిచేసిన సత్యనారాయణ రెడ్డి లాంటి వ్యక్తులు చదివిన పాఠశాల అని కొనియాడారు. అయితే గత ప్రభుత్వం ఈ పాఠశాలను దత్తత తీసుకున్నామని ప్రకటించి ఒక్క పని కూడా చేయకుండా గాలికి వదిలేసిందని అన్నారు. పదేళ్ల పాలనలో ఆ ప్రభుత్వం విద్యను పూర్తిగా నిరక్ష ్యం చేసింది అని గుర్తు చేశారు. పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులకు, బాలికలకు శౌచాలయాలు కూడా లేని పరిస్థితి తన దృష్టికి వస్తే వెంటనే నిర్మించాలని గుర్తు చేశారు. పది సంవత్సరాల కేంద్ర, రాష్ట్రాల పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన విద్యారంగాన్ని అన్ని విధాలా బాగు చేసే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరోవైపు ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోడు గుర్రాలల ముందుకు సాగుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. విభిన్న కులాలు, విభిన్న మతాలు ఉన్న ఈ దేశంలో విద్యారంగంతోనే ప్రతి ఒక్కరూ బాగుపడతారు అన్న లక్ష ్యంతో ఆనాటి పండిత్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఇలాంటి వాళ్లు విద్యా వ్యవస్థకు ఎంతో విలువని ఇచ్చారని అన్నారు. ప్రతి గ్రామంలో కూడా విద్యాలయాల ఏర్పాటు కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. మొగిలిగిద్ద గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం, అడ్వాన్స్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని, దీని ద్వారా త్వరలోనే మొగలిగిద్ద రూపరేఖలు మారిపోతాయని స్పష్టం చేశారు. ప్రజలు గత ప్రభుత్వం ఏం చేసింది, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పనులతో ముందుకు వెళుతున్నది అన్నది స్పష్టంగా పరిశీలించాలన్నారు. ఇంత పెద్ద చరిత్ర కలిగిన అతిపెద్ద గ్రామానికి మండల కేంద్రం కూడా ఇవ్వలేని దుస్థితి గత ప్రభుత్వాన్నిదని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని ఈ

## భళారే చిత్రం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆయన తన రాజీనామాను అధిష్టానానికి పంపించారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొంటున్న కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. బీఆర్ఎస్ నుంచి చైర్మన్ అభ్యర్థిగా బరిలో దిగిన తన మిత్రుడు పటేల్ నర్సింహులు కోసమే రాజీనామా చేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. గతంలో గెలుపొందిన పలువురు ఎమ్మెల్యేల కోసం డాక్టర్ సంపత్ పని చేశారు. అయితే, ఆనతికాలంలోనే వారిని విభేదించి దూరమైనారు. 2023లో మనోహర్‌రెడ్డి కోసం పని చేశారు.

## పెయిడ్ న్యూస్‌పై ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అరికట్టాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా ఆదేశించారు. సోషల్ మీడియాపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను విజయవంతం చేసే బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు. యువత, సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, మెసేజ్‌లు పోస్టు చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా సమాచారం ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజనిజాలను నిర్ధారించుకోవాలన్నారు. అభ్యంతరకర కంటెంట్ విషయంఒల గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు, పౌరులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ కోరారు.

## పెరిగిన మున్సిపల్ వేడి

(మొదటి పేజీ తరువాయి)

ఆకట్టుకున్నారు. 15వార్డులకు గాను చివరిరోజు అభ్యర్థుల నుండి 60 నామినేషన్లు దాఖలు కాగా, మొత్తంగా నామినేషన్లు 109కి చేరుకున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జనవరి 28 నుండి 30 వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లు పత్రాలను ఎన్ని కల అధికారులు స్వీకరించారు. చివరిరోజు బలప్రదర్శన చేయడంతో నామినేషన్ దాఖలు కేంద్రమైన మున్సిపల్ కార్యాలయం పరిసరాలు కోలాహలంగా కనిపించింది. డప్పు చప్పుళ్ళు, బాణాసంచా పేలుళ్ళతో పలువురు అభ్యర్థులు సందడి చేశారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ వంటి నిబంధనలు అమలు చేశారు. నామినేషన్ దాఖలు కేంద్రాల వద్ద బందోబస్తును ఎస్సై బి. వెంకటేశ్ పర్యవేక్షించారు. పోలీస్‌శాఖతోపాటు ట్రాఫిక్ సిబ్బంది విధులు కూడా వాహనాలను నియంత్రించారు. కాగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 15లకు గాను ఇప్పటివరకు ఒకటవ వార్డుకు 6, రెండవ వార్డుకు6 , మూడవ వార్డుకు 6, నాలుగవ వార్డుకు9, ఐదవ వార్డుకు15, ఆరవ వార్డుకు6, ఏడవ వార్డుకు4, ఎనిమిదవవార్డుకు8, తొమ్మిదవ వార్డుకు13 . పదవ వార్డుకు6, పదకొండవవార్డుకు4, పన్నెండవవార్డుకు6, పదమూడవ వార్డుకు4, పద్నాలుగో వార్డుకు8, పదిఐదవవార్డుకు8 చొప్పున అభ్యర్థులు నామినేషన్లు పత్రాలు దాఖలు చేశారు. రిజర్వేషన్ ప్రకారం జనరల్ 8( మహిళలకు 4, ఇతరులకు 4) ఎస్టీ 4 ( మహిళలకు 2, ఇతరులకు 2) ఎస్సీ 2( 1 మహిళ) బిసి 1 (జనరల్) కేటాయించారు. 16984 మంది ఓటర్లు ఉండగా, పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఉన్నారు. మహిళలు 8509 మంది ఉండగా 8475 మంది పురుషులు ఉన్నారు. 6వవార్డులో అత్యధిక ఓటర్లు, 9వ వార్డులో అత్యల్ప ఓటర్ల సంఖ్య కలిగి ఉంది.

## ఛాన్స్ ఇవ్వలేదని జంప్

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం అలియాబాద్ మున్సిపాల్టీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సంఘం వరకు బిఆర్ఎస్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సమక్షంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి రాంరెడ్డి, ఆయన సతీమణి బండి లక్ష్మి, ఆయనకు కుమారుడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి శ్రీకర్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు కె.సుదర్శన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జి.కొండల్‌రెడ్డి, జి.నిఖిల్‌లు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అయితే అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని 8వ వార్డుకు బండి లక్ష్మి రాంరెడ్డికి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఖరారు చేయటంతో బిఆర్ఎస్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ గ్రామానికి చెందిన శామీర్‌పేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి రాంరెడ్డి గత 30ఏళ్లకు పైగా ముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నా అతనికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదని, ఆయనను, రాంరెడ్డి సతీమణి బండి లక్ష్మిని కాంగ్రెస్ పార్టీలో చేర్పించి బిఆర్ఎస్ పార్టీ నుంచి 8వ వార్డు నుంచి పోటీ చేయటం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వారితో పాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగిందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చేసింది ఏమి లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కూడ ఏవి అమలు చేయటం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదని ఆయన ఎద్దేవా చేశారు. తాను స్వంత నిధులతో సిసి రోడ్లు వేశానని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. అలియాబాద్ గ్రామంలో 7వార్డులలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. ఈ సందర్భంగ బిఆర్ఎస్ పార్టీలో చేరిన బండి రాంరెడ్డి మాట్లాడుతూ తాను గత 30ఏళ్లకు పై నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగినట్లు, ఈ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయటానికి టికెట్ ఇవ్వలేదని, సీనియర్ నాయకునిగా గుర్తింపు ఇవ్వకపోవటంతో తాను తన కుటుంబం కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించినప్పటికీ గుర్తింపు దక్కలేదని, కొత్త వారికి అవకాశం ఇచ్చినట్లు దీన్ని నిరసిస్తూ తాను తన కుటుంబం సభ్యులు బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు,మరి కొందరు కూడ బిఆర్ఎస్‌లో చేరటం జరిగిందని, 8వ వార్డు నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా బండి లక్ష్మిరాంరెడ్డిగ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



నందిగామ వద్ద ఉపముఖ్యమంత్రికి భారీ గజమాలతో స్వాగతం పలికిన నాయకులు.

**నందిగామ, జనవరి 30, (ప్రభాతవార్త):** మొగిలిగిద్ద గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనస్వాగతం లభించింది. తమ అభిమాననేత బట్టి విక్రమార్క నందిగామకు చేరుకోగానే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగల్ నర్సింలు, సర్పంచ్ కొమ్ము కృష్ణల ఆధ్వర్యంలో భారీ క్రేన్ సాయంతో భారీ గజమాల వేశారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో మొగిలిగిద్ద తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మంత్రుల వెంట మాజీ ఎమ్మెల్యే చెవులపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి, కాశీనాథ్ రెడ్డి,మాజీ ఎంపీపి శివశంకర్ గౌడ్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు గొంగళి హరినాథ్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నర్సింలు, కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి, సి. మల్లేష్,మాజీ సర్పంచి జటావత్ రాజు నాయక్,ఉప సర్పంచ్‌లు ప్రభు, వెంకటేష్ గౌడ్, మూడవ రవీందర్ నాయక్, వార్డ్ సభ్యులు అగ్గి ప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్, శివగళ్ళ సురేష్, బొమ్మ గళ్ళ నర్సింలు,చించేటి లత శివ,టైలర్ కృష్ణ, కిట్టు,నాయకులు జె సుదర్శన్ గౌడ్ ,కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి,అంబటి ప్రభాకర్,రాందాస్, చిలకమారి నర్సింలు, కావలి కృష్ణ, నీరటి రవీందర్.,జనార్దన్ చారి,జెనిగే జగన్ , మానయ్య, చిందం నరసింహులు, చించేటి కృష్ణ,గంగిశెట్టి శ్రీను, రూప్ సింగ్ ,సీతారాం,పిట్టల రాములు, తీగపూర్ ఆంజనేయులు,వెంకట్ చారి,బి జంగయ్య గౌడ్,బి కృష్ణ రెడ్డి,ప్రభయ్య,డి. లింగం, ఏ అంజయ్య, శివగల్ల సుమన్,ఎర్రగారి రమేష్, అంతయ్య ,బి, కృష్ణ యాదవ్, అడ్వకేట్ అంజి యాదవ్,అబ్దుల్ గని ,పాత్లావత్ శ్రీనివాస్ నాయక్ ,జె మనోజ్ రెడ్డి,దార శ్రీనివాస్, జిల్లాపబ్బతి కరుణాకర్,కేశమోని రామచందర్ ,తడకల జంగయ్య ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

## ఉపముఖ్యమంత్రి, మంత్రిని స్వాగతించి ..లడ్డు ప్రసాదం అందజేసిన సర్పంచ్



**నందిగామ, జనవరి 30, ప్రభాతవార్త :** మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు శుక్రవారం నందిగామ వద్ద నందిగామ సర్పంచ్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ తిరుమల లడ్డు అందజేశారు. మంత్రులను కలిసి పూల బొకే ఇచ్చి స్వాగతించారు.ఈసందర్భంగా జిల్లాసర్పంచుల సంఘం అధ్యక్షుడు ,నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ తిరుమల లడ్డు మంత్రులకు అందజేశారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు,వార్డ్ సభ్యులు శివగళ్ల సురేష్, నాయకులు శివగళ్ల సుమన్ , దార శ్రీనివాస్ . రేందర్ రెడ్డి తదితరులున్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయం

..సర్పంచ్ ఆనంద్ నాయక్



కందనెల్లితాండాలో బోరు వేయించిన సర్పంచ్

**పెద్దేముల్, జనవరి 30, (ప్రభాతవార్త):** గ్రామ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్ అన్నారు. పెద్దేముల్ మండలం కందనెల్లితాండాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా శుక్రవారం సర్పంచ్ ఆనంద్ నాయక్ బోరువేయించి మోటారుబిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆనంద్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ సర్పంచ్‌గా ఇచ్చిన మాటకు కట్టుబడి బోరు వేయించి ప్రజల దాహార్తిని తీర్చామని అన్నారు.గ్రామంలో నెలకొన్న సమస్యలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో దశల వారిగా పరిష్కరిస్తామని అన్నారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించి అందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జె.అశోక్, ఆర్. నితిష్ నాయక్, జె.పాండు, వి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్ గృహకల్ప కాలనీలో

## అక్రమ నిర్మాణాలను నిలిపివేయండి

ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని తక్షణమే నిలిపివేయించాలని కోరుతూ శుక్రవారం కాలనీవాసులు ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజీవ్ గృహకల్ప కాలనీలో బ్లాక్ నెంబరు 21కి ఇరువైపులా అదనపు నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డుకు దగ్గరగా నిర్మాణాలు రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని తెలిపారు. ఈ బ్లాక్‌కు మరో ప్రక్కన వాటర్‌పైపులైన్ ఉండటంతో అదనపు నిర్మాణాల కారణంగా ఇబ్బందులు ఎదురు కానున్నట్లు తెలిపారు. బ్లాక్ 21లో అదనపు అంతస్తుల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయించాలని కోరుతూ రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు దివ్య, ఎల్లమ్మ, బాలరాములు, శ్రీకాంత్ తదితరులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## అమృతమూర్తికి అశ్రునివాళి

దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



మేకగూడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి.

**నందిగామ, జనవరి 30, ప్రభాతవార్త :** నందిగామ మేకగూడ గ్రామానికి చెందిన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నోముల పద్మారెడ్డి మాతృమూర్తి కీర్తిశేషులు నోముల అనసూజ దశదినకర్మకు శుక్రవారం ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీ న్ కుమార్ రెడ్డి హాజరై ఆమె చిత్ర పటానికి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో మాజీ ఉపసర్పంచులు నరసింహులు, రాంరెడ్డి ,నాయకులు సుధీర్ రెడ్డి, నందిగామ మాజీ వార్డ్ మెంబర్ తుప్పుడు క్రిష్ణ, ధర్మయ్య, తుప్పుడు కిష్టయ్య, శివగల్ల యాదయ్య, ఫైయం, కాజా శ్రీరామ్ ,శివచారి ,మోహన్, శ్రీశైలం, రాములు, శ్రీను తదితరులు ఉన్నారు.

## పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

తహశీల్దార్ కృష్ణయ్య, సిఐ భూపాల్ శ్రీధర్



మాట్లాడుతున్న సిఐ భూపాల్ శ్రీధర్

**చేవెళ్ల, జనవరి 30, ప్రభాతవార్త :** సమాజంలో ఎవరి హక్కులకు భంగం కల్గించొద్దని తహశీల్దార్ కృష్ణయ్య, సిఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. చేవెళ్లలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలిం చాలని, అన్ని కులాలు, వర్గాలవారు సోదరభావంతో మెలగాలని సూచించారు. పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఉంటేనే పౌరహక్కులను సమానంగా అనుభవిస్తారని తెలిపారు.సమాజంలో కుల వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళితులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోటి వారు సహకరిం చాలన్నారు. అన్ని గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని జరుపుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫర్ హాస్టల్ వెల్ఫర్ అధికారి శ్రీపావని, డిప్యూటీ తహశీల్దార్ రాజేందర్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## చేవెళ్ల మున్సిపాలిటిపై టిఆర్పి జెండాను ఎగురవేద్దాం



మాట్లాడుతున్న టిఆర్పి నాయకులు

**చేవెళ్ల, జనవరి 30, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటిలో టిఆర్పి జెండా ఎగరవేయాలని చేవెళ్ల మండల అధ్యక్షులు కునుకుర్తి అశోక్ (అడ్వొకేట్ ) అన్నారు ఈరోజు 5వ వార్డు టిఆర్పి అభ్యర్థిగా మోడపల్లి రాజు నామినేషన్ వేయడం జరిగింది.చేవెళ్ల మున్సిపాలిటీలో టిఆర్పి బలపార్చిన అభ్యర్థుల గెలుపు కొరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ చేవెళ్ల మండల యూత్ ప్రెసిడెంట్ సందీప్, నరేష్ గౌడ్, సురేష్ టిఆర్పి నాయకులు పాల్గొన్నారు.

## పౌరులు హక్కులు.. బాధ్యతలు తెలుసుకోవాలి

**జిల్లేడు చౌదరిగూడెం, జనవరి 30,ప్రభాత వార్త:** ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను సైతం తెలుసుకోవాలని జిల్లేడు చౌదరి గూడెం తహసిల్దార్ జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్కగూడెంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సర్పంచ్ బందెయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జగదీశ్వర్ మాట్లాడుతూ బాధ్యతగా మెలుగుతూ హక్కులు పొందాలని అన్నారు. నాయబ్ తహశీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ .. ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కులను గురించి అవగాహన పొంది ఉండాలని అన్నారు. ప్రతి నెల 30వ తేదీన ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని ప్రజలు ఎక్కడైనా తమ వ్యక్తిగతలకు భంగం కలిగితే విన్నవించుకోవచ్చని సూచించారు వాటిని కాపాడేందుకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.నాయబ్ తహసీల్దార్ భాస్కర్, ఆర్ ఐ సలీం, సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ నాగారం అనంతమ్మ, గ్రామస్తులు వెంకట నర్సింహారెడ్డి, రామ్ రెడ్డి, నర్సింలు హాస్టల్ వెల్ఫేర్‌ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం ముందు కౌలు రైతుల ఆందోళన



తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కురిమిద్ద,నజ్దిక్ సింగారం సర్పంచ్ లు, రైతులు

**యాచారం,జనవరి 30, ప్రభాతవార్త :** యాచారం మండలం నజ్దిక్ సింగారం,తాటిపర్తి, కుర్మిద్ద, నందివనపర్తి గ్రామాల రక్షిత కౌలు దార్లకు 1400ఎకరాల భూమి పట్టాలు చేయాలనీ,ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేసే ప్రతిపాదన ప్రభుత్వం విరమించుకోవాలని తాసిల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అంజయ్య అధ్యక్షతన పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు .ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి యాదయ్య మాట్లాడారు. అనంతరం తాసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. సిపిఎం పార్టీ మండలం కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, నజ్దిక్ సింగారం సర్పంచ్ బోడ క్రిష్ణ, కురిమిద్ద సర్పంచ్ శ్రీవిద్యా శ్రీరాములు, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో రైతులు జె రాములు,చందు,ఎం జంగయ్య,ఎం సురేష్,బి క్రిష్ణ,జంగయ్య ,మల్లేష్ చెన్నయ్య,మల్లేష్, పొలు నర్సింహా,చెంద్రమ్మ, రాములు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ నీటి సమస్యలను పరిష్కరిద్దాం



భగీరథ గ్రిడ్ కిరణ్ కుమార్

**చౌడాపూర్ , జనవరి 30, ప్రభాతవార్త:** వచ్చే వేసవికాలంలో మిషన్ భగీరథ నీటి సమస్యలపై గల పరిష్కారాలకు,చేపట్టే చర్యలు,పలు అంశాల గురించి భగీరథ గ్రిడ్ కిరణ్ కుమార్ సర్పంచులకు వివరించారు. శుక్రవారం చౌడపూర్ రైతు వేదికలో 24 గ్రామ పంచాయతీల సర్పంచులతో సమావేశం నిర్వహించారు.. సర్పంచుల నుండి గ్రామాలలో ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై వివరాలు సేకరించి పలు సూచనలు అందించారు. మిషన్ భగీరథ ట్యాంక్ లు,బోర్ మోటార్ల పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో సోమలింగం, ఏఈ అభిలాష్, ఎంపిఓ రాజిరెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ చంద్రశేఖర్ , నూతన సర్పంచులు,పంచాయితీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.



డేటా డైనమో 2.0 హ్యాకథాన్ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న కళాశాల డీన్ వి. విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు.

## ఘనంగా డేటా డైనమో 2.0 హ్యాకథాన్ ప్రారంభం

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డేటా డైనమో 2.0 హ్యాకథాన్‌ను ప్రారంభించారు. ఈ హ్యాకథాన్‌కు 600 మంది విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. హ్యాకథాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంజినీరింగ్ కళాశాలడీన్ వి. విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యారంగం, పరిశ్రమల మధ్యసహకారం స్పష్టంగా ఉంటుందని అన్నారు. నూతన ఆవిష్కరణలు, విభిన్న శాఖల సమన్వయంతో జరిగే సహకారం ప్రాయోజిత నైపుణాల అభివృద్ధి,ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్గుతుందని అన్నారు. కోఫోర్జ్ డైరక్టర్ నరసింహరాజు అల్లూరు, అకడమిక్ ప్రోగ్రామ్ మేనేజర్ పంకజ్‌ముతే, గూగుల్ డెవలపర్ గ్రూప్స్ మేనేజర్ అర్షద్ దేవాని, డేటా సైన్స్ విభాగం హెడ్ ఎం. శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మిట్టకంకల్‌లో మహిళాసంఘాల నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గోపాల్,న్యాయవాది ఆనందం తదితరులు

## మహిళాసంఘాల అభివృద్ధికి పెద్దపీట

**పూడూరు, జనవరి 30, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యతను ఇస్తుందని సర్పంచ్ గోపాల్,హైకోర్టు న్యాయవాది కడుమూరు ఆనందం పేర్కొన్నారు. శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ క్రింద రూ.10లక్షల నిధులతో మంజూరి అయిన మహిళా సంఘాల నూతన వర్కుషెడ్ భవన నిర్మాణపు పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొర్రి బందయ్య,మాజీ సర్పంచ్ శ్యాంకుమార్,ఎఇ మధుసూధన్,పంచాయతీ కార్యదర్శి జయరాజ్,వార్డు సభ్యులు ఎం శ్రీనివాస్ ,మనీష్‌కుమార్,రమేష్,డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు మమత,నాయకులు చిన్న బందయ్య,దేవయ్య,దశరథ,శివశంకర్,శంకరయ్య,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణయ్య ను సన్మానిస్తున్న నాయకులు

## ఎపిఒకు ఘన సన్మానం

**తలకొండపల్లి, జనవరి 30 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల ఎపిఒగా పనిచేస్తున్న కృష్ణయ్యను శుక్రవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఏపీవోగా ప్రశంసలు అందుకున్న కృష్ణయ్యను బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మ అనిల్ మాట్లాడుతూ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే మండలానికి మంచి పేరు వస్తుందని, మన మండలంలో ఉత్తమ ఏపీ కృష్ణయ్య ఎంపిక కావడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్ అనిత వినోద్ కృష్ణ రాధాకృష్ణ రవి నాయక్ గిరి లింగస్వామి తానయ్య యాదగిరి తదితరులున్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ వరమణ తప్పనిసరి

ఎంఈఓ అబిబ్‌అహ్మద్



ఉద్యోగ విరమణలో పాల్గొన్న ఉపాధ్యాయులు,

**కుల్కచర్ల,జనవరి 30, ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగికి పదవీ వరమణ తప్పనిసరి అని ఎంఈఓ అబిబ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుల్కచర్ల పాథమీక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉదోగ్య విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్‌నుత సన్మానించారు.విధినిర్వహణలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వార్పల ఆంజిలయ్య, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, జానకి రామ్, కుమ్మరి స్వామి, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రాములు,మండల అధ్యక్షులు రమేష్,గౌరవ అధ్యక్షులు రమేష్, ఉపాధ్యాయులు రవి కమార్, అనంద్, అయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతరంలో పౌర హక్కుల దినం



అంతరంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

**తలకొండపల్లి జనవరి 30, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో శుక్రవారం నాడు పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని మండల అధికారులు సమావేశమయ్యారు. గ్రామంలోని ప్రజలందరితో సమావేశం నిర్వహించి, పౌరుల హక్కుల గురించి వారికి వివరించారు. ఎలాంటి వివక్షత లేకుండా చట్టం ముందు అందరు సమానులు అంటూ ఈ సందర్భంగా తాసిల్దార్ రమేష్ గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలోని ప్రజ లందరూ సమన్వయంతో ఉండి అధికారులతో తమ పనులు చేయించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే శని త్రయోదశి



**మోమిన్‌పేట్,జనవరి 30,ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలసిన శ్రీ శనైశ్వర స్వామి దేవాలయంలో నేడు శని త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణాధికారి నరేందర్ తెలిపారు. ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని దోశ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నా, మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారు నేటి శని త్రయోదశి రోజున శనైశ్వర స్వామికి ప్రత్యేక పూజలు తైలాభిషేకాలు చేయించుకోవడం ద్వారా, శనైశ్వరుని ప్రతికూల ప్రభావం శాంతించి, కర్మ దోషాలు తొలగి, జీవి తంలో స్థిరత్వం కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయని, అందు కోసం శని అమావాస్య మరియు శని త్రయోదశి రోజున భక్తులు అధికసంఖ్యలో వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించుకుంటారని ఈఓ అన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎఈఈ శివసాయి

## త్రాగునీటి సరఫరాపై స్పెషల్‌డ్రైవ్

**దౌల్తాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారంరోజు రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని 33 గ్రామాల సర్పంచులు,పంచాయితీ సెక్రెటరీలకు త్రాగునీటి సరఫరాపై స్పెషల్‌డ్రైవ్ నిర్వమించారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈఈ శివసాయి మాట్లాడుతూ...వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండ ముందస్తు కార్యచరణ సిద్ధం చేసుకోవాలని సర్పంచులకు,పంచాయితీ సెక్రెటరీలకు సూచించారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్,ఎంపిఒ శ్రీధర్,జూనియర్ అసిస్టెంట్ చిన్నస్వామి,ఏపీఓ అంజిలయ్య,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయితీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

# ఘనంగా బాపూజీకి నివాళులు

### ఆమనగల్లులో..



ఆమనగల్లులో నివాళులు అర్పిస్తున్న ప్రజలు

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గాంధీ చౌక్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, గాంధీవిగ్రహదాత వీరబొమ్మ రాంమోహన్‌గుప్త ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ వర్ధంతి వేడుకలకు మాజీ ప్రతినిధులు, పలు రంగాల ప్రముఖులు హాజరైనారు. గాంధీకి నివాళులు అర్పించిన తరువాత వీరబొమ్మ రాంమోహన్‌గుప్త పేదలకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, తెల్గమళ్ళ జగన్, అవ్వారి శివలింగం, కృష్ణానాయక్, అప్పం శ్రీను, వస్పుల మానయ్య, బిక్యానాయక్, కాలె మల్లయ్య, మెకానిక్ బాబా, ఎండీ ఫరీద్, హలీమ్, రఫీ, ఆమనగల్లు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, మెండెం చంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీధర్, కొరివి వెంకటయ్య, వెంకటేశం, శ్రీనివాస్‌గుప్త, క్రాంతికుమార్, పెండ్యాల నాగరాజు, యాదగిరి, ఎఆర్ ప్రభాకర్, జే.వాసు తదితరులు ఉన్నారు.

## మహాత్మాగాంధి ఆశయసాధనకు కృషిచేయాలి

..టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్



పెద్దేముల్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

**పెద్దేముల్, జనవరి 30, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్ అన్నారు. శుక్రవారంమహాత్మాగాంధి వర్ధంతిని పురస్కరించుకొని పెద్దేముల్ మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యండి.రియాజ్ మాట్లా డుతూ బ్రిటిష్ పాలకులతో పోరాటం చేసి స్వాతంత్రం తెచ్చిన ఘనత మహాత్మాగాంధిదేనని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి మాజీ చైర్‌పర్సన్ పడగల్ల బుజ్జమ్మ, మార్కెట్ కమిటి డైరెక్టర్ ఏక్బాల్, కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, వార్డు సభ్యులు ఎర్ర వెంకటేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు సయ్యద్ షబ్బీర్, నాయకులు నల్లా శ్రీనివాస్‌రెడ్డి, పురుగుర్తి నర్సింహరెడ్డి,కోళ్ళ పెంటప్ప, పడగల్ల రాజు, బ్యాగరి మల్లేశం, డి,చంద్రశేఖర్, నర్సిములు పాల్గొన్నారు.

### తొమ్మిది రేకుల గ్రామంలో ..





గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

**కేశంపేట, జనవరి 30, ప్రభాతవార్త:** కేశంపేట మండలపరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ 78వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీస కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం, సమానత్వం, అహింస మార్గం కోసం మహాత్మా గాంధీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి నాయక్, మాజీ ఎంపిటిసి రంగయ్య, మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య నరసింహారెడ్డి, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, పోగుల నరేష్, గుత్తి చంద్రయ్య, లచ్చిరామ్ నాయక్ పాల్గొన్నారు. అలాగే నాయకులు లలామెని చంద్రయ్య, గుత్తి శేఖర్, రాఘవాచారి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, రొయ్యల నరసింహులు, జైపాల్ రెడ్డి, కావలి సత్తయ్య, లింగందన కృష్ణయ్య గౌడ్, లాలమెని లక్మయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ వర్ధంతి..నాయకుల నివాళి

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** అహింసామార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ పేర్కొన్నారు.. ఈసందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో వాసవీ టవర్స్ ముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథా లయం ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ సొసైటీ డైరక్టర్ మొదబోయిన వెంకటేశ్, డిపీసీ మాజీ సభ్యులు నల్లగారి భానుప్రకాష్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, సహకార సంఘం మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, బొక్క ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌కె వాజీద్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు ఎండి.రహీముద్దిన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు విద్యాసంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి



**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి విద్యాకమిషన్ సిఫార్సులు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలు జ్యోత్స్నశివారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఆమె పర్యటించి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లా పరిషత్ బాలు, బాలికల ఉన్నత పాఠశాలలు, గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాలను ఆమె పరిశీలించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఒకే చోట ఏర్పాటు చేయాలని, గురుకుల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం చేయాలని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఇటీవల ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ సూచన మేరకు సభ్యురాలు జ్యోత్స్నశివారెడ్డి ఘట్‌కేసర్‌లోని జడ్పీ పాఠశాలలు, గురుకుల్‌లో జరుగుతున్న విద్యాబోధన, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, సమస్యలను ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, విజయలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల్ ట్రస్ట్ భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, గురుకుల్ ట్రస్ట్‌కు సంబంధించి కోర్టు కేసులు, ఇతర వివాదాలను పరిశీలించి 27 ఎకరాల భూమిని దేవాదాయశాఖ నుంచి విద్యాశాఖకు బదలి చేయించేలా విద్యార్థుల ప్రయోజనాల కోసం విద్యాసంస్థ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. గతంలో ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై విచారణ జరిపారని అన్ని పాఠశాలలు గురుకుల్‌లోని విశాలమైన స్థలంలో ఒకే చోట ఏర్పాటు చేయాల్సిన అవసరంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆమెకు ఇక్కడ విద్యార్థుల సమస్యలను తెలియజేశారు. గురుకుల్ నిర్వహణపై ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రజినిలు ఇక్కడ కల్పించాల్సిన మౌళిక వసతులపై ఆమెకు వివరించారు.

# సత్తా చాటుతున్న మట్టిలో మాణిక్యాలు




## క్రీడల్లో ఆర్కపల్లి విద్యార్థుల ప్రతిభ

**మాడ్గుల,జనవరి30,ప్రభాతవార్త:** మండలంలోని ఆర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ మండలం ,జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు సాధిస్తున్నారు.గ్రామీణ ప్రాంతం నుంచి ఎదుగుతున్న ఈ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా నిలుస్తున్నారు.రాష్ట్ర స్థాయిలో కబడ్డీ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుంచి ఎస్.కె. రేష్మ (సబ్ జూనియర్ టీం),సీత రేణుక (జూనియర్ టీం) ఎంపికై తమ ప్రతిభను చాటారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో తోలు వైష్ణవి పాల్గొన్నారు.జిల్లా స్థాయి క్రీడల్లో నలుగురు విద్యార్థులు పాల్గొని మంచి ఫలితాలు సాధించారు.సిఎం కప్ పోటీల్లో మండల స్థాయిలోకబడ్డీ (మహిళ) ప్రథమ బహుమతి,వాలీబాల్ ద్వితీయ బహుమతి,కోకో (బాలుర విభాగం)ద్వితీయ బహుమతి సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు.క్రీడలతో పాటు చదువులోనూ ఆర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న జిహెచ్ఎం సుజాత పాత్ర అభినందనీయం అని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.


కోనాపూర్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీలత, ఎంపిడిఒ కుసుమ మాధురి

## అట్టహాసంగా సిఎం క్రీడా పోటీలు

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాత వార్త:** ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో శుక్రవారం మండల స్థాయి సిఎం క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమైనాయి. గ్రామ సర్పంచు శ్రీలత, ఎంపిడిఒ కుసుమ మాధురిలు హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కుసుమ మాధురి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం క్రీడా పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరై తమ క్రీడా ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. మండలస్థాయిలో అత్యుత్తమప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయబడుతుందని ఆమె తెలిపారు. ఆటలలో కూడా రాణించి ప్రత్యేక గుర్తింపును పొందాలని సర్పంచ్ శ్రీలత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలవిద్యాధికారి పాండు, మండల పంచాయతీ అధికారి లక్ష్మణ్, రాం నుంతల సర్పంచు శ్రీను , శంకర్ కొండ తాండ సర్పంచ్ రాములు . పంచాయతీ కార్యదర్శులు మల్లేషు , జగన్, కోనాపూర్ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సిఎం కప్ క్రీడా పోటీలు

సర్పంచ్ మదుగు శ్రీనివాస్

**కుల్కచర్ల,జనవరి 30,ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం సిఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, సర్పంచ్ మదుగు శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ పాఠశాల అవరణలో సిఎం కప్ క్రీడా పోటీలను తాహసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపిడిఒ రామకృష్ణ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పల్లెలోని యువత,విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా లభిస్తుందని అన్నారు.అలాగే తాము ఎంచుకున్న క్రీడల్లో కష్టపడి రాణిస్తే పల్లె స్థాయి నుంచి ప్రపంచ స్థాయి ఛాంపియన్లుగా ఎదగొచ్చన్నారు.సిఎం కప్ క్రీడల ద్వారా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికను కల్పించిందన్నారు.


గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ఎంఇఓ శ్రీధర్

## సిఎం కప్ విజేతలకు బహుమతుల అందజేత

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో జరుగుతున్న సెకెండ్ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్ 2025 క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిసాయి. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, కరమ్స్, చదరంగం ఉత్సాహంగా ఆడారు. సీఎం కప్ 2 ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు మోమెంటోలను ఎంఇఓ శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ విద్యాకమీషన్ సభ్యురాలు జ్యోత్స్నరెడ్డి విచ్చేసి సిఎం కప్ నిర్వహణపై అధికారులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, గిర్దావర్ సాయిరాం, స్కూల్ కాంప్లెక్స్ ఇంచార్జ్-ప్రధానోపాధ్యాయులు కొమిరెడ్డి పాపిరెడ్డి, గురుకుల్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రజిని, జోనల్ కార్యదర్శి శ్రీరాములు, మాజీ సొసైటీ డైరక్టర్ గాయరు విశ్వనాధం, మాజీ వార్డుసభ్యులు బింగి యుగంధర్‌గౌడ్, పిజికల్ డైరక్టర్లు, పిఇటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు సుదర్శన హవనం..పుష్కరిణిలో చక్రస్నానం

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నారు నాయకస్వామి ఆలయంలో ఫిబ్రవరి 1వ తేదీన సుదర్శన



హవనం, చక్రస్నానం పూజా కార్యక్రమాలను నిర్వహించ "న్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ప్రతినెలా మొదటి ఆదివారం ఆలయంలో సుదర్శన హోమం జరుగుతుందని, ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య శ్రీసుదర్శన హవనం జరుగుతుందని పూర్ణాహుతి అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు కోనేరులో ఉత్సవమూర్తులకు చక్రస్నానం (అవభృథ స్నానం) నిర్వహిస్తామని చెప్పారు. ఈమేరకు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఈసమయంలో పుష్కరిణిలో స్నానం చేయడం వల్ల దోషాలు తొలగిపోతా యని, మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పుష్కరిణిలో చక్రస్నానం అద్భుత ఘట్టమని వీక్షించి, స్నానం ఆచరించిన వారికి అమోఘ పుణ్యఫలం కల్గుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు.

## నేడు శ్రీవేణుగోపాలస్వామి ఘనంగా వైకుంఠోత్సవం..

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పుణ్యాహవచనము, గీతాహవనము, కర్మ, సన్యాస, ఆత్మసంయమన, విజ్ఞాన అధ్యాయముల హవనము, నిత్యపూర్ణాహుతి, మంటప ప్రాకారసేవ, వైకుంఠోత్సవం (నమ్మాళ్వార్ పరమపదోత్సవం) ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పలాచార్యులు, మురళీకృష్ణ, వరదరాజులు తెలిపారు. పుణ్యహవాచనము, అక్షర పరబ్రహ్మ, రాజవిద్య, రాజగుహ్య, విభూతియోగ అధ్యాయము హవనం, నిత్యపూర్ణాహుతి, సేవాకాలము, ప్రోభోధకి ఆరగింపు, స్వామివారి గ్రామసేవ, ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో రుక్మిణీ, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం , కళ్యాణ మండ పంలో సహస్ర దీపాలంకరణసేవ ఉంటుందని తగిన ఏర్పాట్లుచేశామని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## సీనియర్లను విస్మరిస్తే పార్టీకి నష్టం

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులను విస్మరించి బీఆర్ఎస్‌పార్టీ నుంచి చేరిన నాయకులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని బొక్క సత్తిరెడ్డి విమర్శించారు. ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలకు సంబంధించి సీనియర్లకు సమాచారం ఇవ్వకుండా కొత్తగా వచ్చిన వారికి ఫోన్ చేసి చెబుతున్నారని దీని వల్ల ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న నాయకుల మనోభావాలను దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. సీనియర్ల మనోభావాలకు భంగం కల్గిస్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందని, పార్టీ నాయకులు అందరిని కలుపుకొని సమన్వయంతో పని చేయాలని కొందరు గ్రూపులను పోషించే విధంగా ప్రవర్తిస్తున్నారని సత్తిరెడ్డి ఆరోపించారు.

## రైల్వేవంతెన నిర్మాణ పనులు నిరాటంకంగా కొనసాగుతాయి

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ పేర్కొన్నారు. రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబీ పనులు జరుగుతున్న స్థలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కాంట్రాక్టర్ కొంతం సత్తిరెడ్డి, రోడ్లుభవనాలశాఖ ఏఈ సింధుప్రియలతో కలిసి మాటాడారు. వంతెన పనులు ఆగిపోయాయని కొందరు ప్రచారం చేస్తున్నారని ఎక్కడ కూడా ఆపలేదని నిరాటంకంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లు రూ.4.18 కోట్లు ఫిబ్రవరి 20వ తర్వాత మున్సిపల్ ఎన్నికలు పూర్తి కాగానే ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. కార్మికులు వారి సొంత రాష్ట్రాల్లో ఎన్నికలకు వెళ్లడంతో కొద్దిగా ఆలస్యం అయ్యిందని, వంతెన సామాగ్రి అవసరమైన చోటుకు తరలిస్తామని కానీ పనులు ఆపేదిలేదని కాంట్రాక్టర్ సత్తిరెడ్డి వివరణ


మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, ఆర్‌అండ్‌బి ఏఈ సింధుప్రియ, కాంట్రాక్టర్ సత్తిరెడ్డి

ఇచ్చారు. ఈవిషయంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌లను కలిసి చర్చించామని వారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తెలియజేశారని తెలిపారు. ఏప్రిల్‌లోగా పెండింగ్ శ్లాబుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం లేదని కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లు ఇచ్చి మిగతా పనులు చేపట్టి ఆర్‌ఓబీని పూర్తి చేయిస్తామని ఆర్‌అండ్‌బి ఏఈ సింధుప్రియ తెలిపారు.

## ఘనంగా లక్షబిల్వార్చన

-మార్మోగిన శివనామస్మరణ-శివలింగానికి ప్రత్యేక పూజలు

నిర్వహించిన ఆలయ ధర్మకర్త మాజీ ఎంపిపి

**దౌల్తాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శివస్వాములు


ప్రత్యేక పూజలు అందుకున్న శివలింగం

గ్రామంలో శ్రీ విజయేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారంరోజు ఘనంగా లక్ష బిల్వార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు.ఆలయ ధర్మకర్త,మాజీ ఎంపిపి గౌడంపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ,సంకల్పం,రుద్రాభిషేకం ,శివార్చన,శివాష్టకం,బిల్వాష్టకం,లింగాష్టకం,శివాష్టోత్తర శతనామావళి, ధూప,దీప,నైవేద్యాలను సమర్పించారు.శివలింగానికి మంగళహారతులు యిచ్చి శివనామస్మరణతో వైభవంగా లక్షబిల్వార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.శివస్వాములు భజనలు చేస్తూ శివనామస్మరణతో మార్మోగించారు.అనంతరం శివస్వాములకు,భక్తులకు,ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని శివస్వాములు, గ్రామ పెద్దలు,యువకులు,గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీటి సమస్యలపై ముందస్తు సమీక్ష

-ఫిబ్రవరి 1 నుండి గ్రామాల్లో అధికారుల పర్యటన

**ధారూరు, జనవరి 30, ప్రభాతవార్త :** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ధారూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నర్సింలు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంచినీటి సమస్యలపై అవగాహన చేపట్టాల్సిన చర్యల గురించి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నర్సిములు

ఎంపిడిఒ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఫిబ్రవరి 1, 2026 నుండి 20 రోజుల పాటు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ అ నుబంధ గ్రామాల ు ప్రత్యేక బృందాలు సందర్శిస్తాయని తెలిపారు. ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఏ.ఈ (ఇంట్రా), గ్రిడ్ ఏ.ఈ లు, స్థానిక సర్పంచులు, కార్యదర్శులతో కలిసి క్షేత్రస్థాయిలో నీటి సరఫరా పరిస్థితిని సమీక్షిస్తారని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈ రత్నా ప్రసాద్, డి.ఈ. గ్రిడ్ సువరోచన, ఏ.ఈ. ఇంట్రా పర్వీన్ బా ను, ఏ.ఈ. గ్రిడ్ రామకృష్ణ, ఎం.పి.ఓ షఫీ ఉల్లా ఖాన్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన కుక్కింద గౌరప్ప

**ధారూరు, జనవరి 30, ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ గ్రామానికి చెందిన సంగీత గౌరప్ప బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. మండల సీనియర్ నాయకులు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ హ నుమంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయనపార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కింద మాజీ


కాంగ్రెస్‌లో చేరిన గౌరప్ప

ఎంపిటిసి బసప్ప, ఊరెళ్ళ వీరేశం, కుక్కింద మైనారిటీ నాయకులు చాన్ పాషా గారితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. గౌరప్ప చేరికతో గ్రామంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.


మహా పడిపూజ లో పాల్గొన్న శివ భక్తులు.

## వైభవంగా మహా పడిపూజ

**ఆమనగల్లు, జనవరి 30, ప్రభాతవార్త:** ఆమంగల్ పట్టణ సమీపంలోని అయ్యప్ప కొండ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. శివమాల ధారణ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహాపడిపూజలో పాల్గొన్నారు.

శివ భక్తుడు గుండ్రాతి చందన కుమార్ గౌడ్ దంపతులు మహా పడి పూజను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయమూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. పూజ లు, భజన కీర్తనలు, శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగిపోయాయి. పూజల అనంతరం శివస్వాములకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, భక్తులు, అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో బి వి ఆర్ గురుస్వామి, గాజుల పుల్లయ్య గురు స్వామి, లింగంపల్లి అశోక్, పాత కోట రాజు ,దేవరాజ్, బొల్లు గణేష్, పూసల్ సాయి జంగయ్య, కత్తి గురు స్వామి, గోవర్ధన్, చరణ్, అజయ్, మహేష్, టేకుల యాదగిరి, శీను, మహేష్, శివ స్వాములు భక్తులు పాల్గొన్నారు.

## కొడంగల్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

**కొడంగల్,జనవరి 30,ప్రభాతవార్త:** అభివృద్దే తమ నినాదమని,కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మేన్ అభ్యర్థి నందారం ప్రశాంత్,టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్ అన్నారు.శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్మేన్ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి కొడంగల్ మున్సిపల్ పరిధిలో అంబేద్కర్ చౌరస్తా నుంచి పార్టీ నాయకులు,కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు.ఈ



సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నందారం ప్రశాంత్ మాట్లాడుతూ గడి,గుడి కలిసి ఒకే ఒరలో ఉండి ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా 12 వార్డులకుగాను 12 వార్డులు క్లీన్ స్వీప్ చేసుకొని 5 సంవత్సరాలు కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.గతంలో పని చేసిన అనుభవం ఉంది కాబట్టి(గడి,గుడి కలిసి అభివృద్దిలో నడిపిస్తాం) ఎవ్వరు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీర్వాదంతో 75=80 ఏళ్ళ చరిత్రను కొడంగల్ తిరగరాయ బోతుందన్నారు.ఇటివలే కొడంగల్ అప్పాయిపల్లి కాలేజీలు పోయాఇయని పుకార్లు పుట్టించి గందరగోళం నెలకొల్పే పరిస్థితి సృష్టించారని విమర్శించారు.కానీ ముఖ్యమంత్రితో మాట్లాడి అగ్రికల్చర్ యునివర్శిటి తెచ్చుకున్నామన్నారు.హుస్నేన్‌పూర్‌లో 300 ఎకరాల భూ సేకరణకు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందని,ఎన్నికలైన వెంటనే భూ సేకరణతో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తామన్నారు.కస్తూర్‌పల్లిలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

## నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు

**పరిగి, జనవరి 30, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నామినేసన్ల స్వీకరణకు చివరి రోజు అవ్వడంతో పరిగిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్‌ను మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి, ఐ ఎ ఎస్ సందర్శించారు.శుక్రవారం పరిగి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లా డుతూ నామినేషన్‌ల చివరి రోజు అయినందున సాయంత్రం 5గం.లకు ముందే వచ్చిన వారికి టోకెన్లు ఇవ్వాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకలించాలని



మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి,

అధికారులకు ఆదేశించారు. సమర్థవంతంగా నిర్వహించి, అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేసి, ఏవైనా సందేహాలను నివృత్తి చేయాలనితెలిపారు. 1 నుండి 18 వార్డులకు 6 కౌంటర్లు, 8 మంది ఆర్‌ఓ లు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.సమస్యాత్మక ప్రాంతాలలో పూర్తి స్థాయి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహ సీల్దార్ వెంకటేశ్వరి, డిఎస్పి శ్రీనివాస్ , పోలీస్ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు .



## ఇచ్చిన హామీలపై నాయకులను నిలదీయాలి

మూడుచింతలపల్లిలో బిజెపి ర్యాలీలో పాల్గొన్నఎంపి ఈటల

**శామీర్‌పేట, జనవరి 30, ప్రభాతవార్త** మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో మున్సిల్ ఎన్నికల సందర్భంగా జరిగిన బిజెపి ర్యాలీలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ సందర్భంగ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల గురించి నాయకులను నిలదీయాలని సూచించారు. పెన్షన్లు పెంచుతామన్నారు పెంచలేదని, తులం బంగారం కల్యాణలక్ష్మికి ఇస్తామన్నారు ఇవ్వలేదని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను ఆయన ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు నరేందర్‌గౌడ్, మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, జిల్లా ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, నాయకులు నర్సింలుగౌడ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సిఎం సభ స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ,డీఎస్పీ శ్రీనివాస్,సిఐ శ్రీనివాస్, తదితరులు

## సిఎం సభ కోసం స్థల పరిశీలన

**పరిగి, జనవరి 30, ప్రభాతవార్త :** పరిగిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా సభాస్థలి కోసం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమీక్ష చేపట్టారు.శుక్రవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ,డీఎస్పీ శ్రీనివాస్,సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మోహనకృష్ణ , విద్యుత్ అధికారులతో కలిసి పరిగి మండలం రూప్ ఖాన్‌పేట్, నారాయణపూర్ పరిధిలో సభ స్థలాలను పరిశీలించారు... జన సమీకరణ, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అధికారులు, నాయకులతో చర్చించారు.


ఫార్మా పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన సిపి సుధీర్ బాబు

## ఫ్యూచర్ సిటీ ఫార్మా పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలం పరిశీలన

**యాచారం,జనవరి 30, ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని ఫీచర్స్ సిటీ కమిషనరేట్ పరిధిలో మీర్ఖాన్పేట్లో గలస్థలాన్ని కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం పరిశీలించారు. కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ రెవెన్యూ సర్వేనెంబర్ 112లో గల ఎంపిక చేసిన స్థలాన్ని అతి త్వరలో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సందర్భంగా పేర్కొన్నారు. అన్ని అంగుళాల్లో కార్పొరేట్ తరహాలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ స్టేషన్ నిర్మితమవుతుందని తెలిపారు. రహదారుల నిర్మాణం మౌలిక వసతుల సదుపాయం తదితర అంశాలను చర్చించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జనవరి 30, ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరా మెరుగు పరిచే పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి యంనంపేట్ ఫీడర్ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు11 కెవి బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కెవి కొండాపూర్ ఫీడర్ పరిధిలోని కొండాపూర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, గమనించి తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీలో బిజెపిలో చేరికలు



**మేడ్చల్, జనవరి 30, ప్రభాతవార్త:** ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. మున్సిపల్ పరిధిలోని రాజబొల్లారం తండాకు చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ ఎంపీటీసీ మాలోత్ అంకిత రవినాయక్‌తో పాటు సైదోనిగడ్డ తండాలోని బీఆర్ఎస్‌కు చెందిన మెగావత్ శాంతీ జీవన్‌లు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్ష్యంలో బీజేపీలో చేశారు. వార్డుల ఇంచార్జ్, మేడ్చల్ మున్సిపల్ పార్టీ అధ్యక్షురాలు శైలజ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ చేరికతో బీజేపీకి కీలకమైన రాజకీయ బలం చేకూరింది. రాజబొల్లారం తండా అంకిత రవినాయక్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు సోమారం గ్రామ అభ్యర్థిగా, శాంతి జీవన్ 8వ వార్డు సైదోనిగడ్డ తండా అభ్యర్థిగా నియమించి వారికి పార్టీ బీ ఫారం అందజేశారు. అనంతరం వారు బీజేపీ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, నందారెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, మేడ్చల్ మాజీ వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు హంసరాణి, నాయకులు పుష్పరెడ్డి, విశ్వశాంతి కొండల్‌రెడ్డి, వీర రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## పరిగి ఎస్టీ హాస్టల్లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**పరిగి, జనవరి 30, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా పరిగిలోని గిరిజన సంక్షేమ హాస్టల్లో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది.పరిగి గిరిజన వసతి గృహంలో ఉంటూ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి సంతోష్ , వాంతులు చేస్కుంటుండగా తోటి మిత్రుడు గమనించి పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్ల సమాచారం.. రాత్రి సమయంలో పురుగుల మందు సేవించి వుంటాడని అనుమానం వ్యక్తం చేసిన డాక్టర్లు.విద్యార్థి సంతోష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.